నమస్తే తెలంగాణ

# సూర్యాపేట

5 | నల్లగొండ, సోమవారం 24 ఫిబ్రవరి 2025 | SURYAPET

## శ్రీవర్షరావుకు కేటీఆర్ అభినందనలు

నకిరేకల్, ఫిబ్రవరి 23 : నకిరేకల్ మండలంలోని మంగళపల్లి గ్రామానికి చెందిన సందినేని శ్రీవర్షరావు టాంజానియాలోని కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించింది. శ్రీవర్ష హైదరాబాద్‌లోని మియాపూర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నది. ఈ నెల 13న కిలిమంజారో పర్వత శిఖరంపై జాతీయ జెండాను ప్రదర్శించిందని ఆమె తండ్రి సందినేని రవీందర్‌రావు ఆదివారం తెలిపారు. పర్వతారోహణ చేసిన శ్రీవర్షరావును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అభినందించారు. చిన్నతనంలోనే పర్వతశిఖరాన్ని అధిరోహించిన శ్రీవర్షరావుకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సందినేని వెంకటేశ్వరరావు, మంగళపల్లి గ్రామ మాజీ సర్పంచ్ ప్రగడపు నవీన్‌రావు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.



కిలిమంజారో పర్వత శిఖరాన్ని అధిరోహించిన శ్రీవర్షరావును అభినందిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్



దివ్య విమాన గోపుర మహాకుంభాభిషేక పూజల్లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, సీఎస్ శాంతికుమారి, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు అయిలయ్య, బాలూనాయక్, వీరేశం, అనిల్‌కుమార్‌రెడ్డి

# సాగు నీళ్లు లేక అన్నదాత అరిగోస

**ఎస్సారెస్పీ కాల్వకు విడుదల కాని గోదావరి జలాలు**

- భూగర్భ జలాలు అడుగంటి ఎండుతున్న పంటలు
- నూతనకల్ మండలంలో పశువులకు మేతగా వదిలేస్తున్న దుస్థితి

**యాసంగిలో సాగు చేసిన పంటలకు నీటి తడులు అందించలేక అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. చేతికి వస్తుందన్న పంట కండ్ల ముందే ఎండిపోతుండడంతో రైతులకు భంగపాటు తప్పడం లేదు. భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటగా, బోర్లలో నీళ్లు లేక, ఎస్సారెస్పీ కాల్వల ద్వారా సాగు నీరు రాక రైతులు గోస పడుతున్నారు. రైతు భరోసా ఇవ్వక పంట పెట్టుబడులకు వ్యాపారుల దగ్గర అప్పులు తెచ్చినా, పెట్టిన పెట్టుబడులు సైతం రాక దుర్భర పరిస్థితిలో రైతన్నలు ఉన్నారు.**

– నూతనకల్, ఫిబ్రవరి 23



నూతనకల్ మండలం చిల్పకుంట్ల గ్రామంలో వరి పైరును మేస్తున్న గొర్రెలు



నీళ్లు లేని నూతనకల్ మండలంలోని ఎస్సారెస్పీ కాల్వ

### 300 ఎకరాల్లో ఎండిన వరి

నూతనకల్ మండలంలో ఈ యాసంగిలో మొత్తం 12,087 ఎకరాల్లో వరి సాగు చేశారు. సన్న వడ్లు 1,575 ఎకరాల్లో, దొడ్డు వడ్లు 10512 ఎకరాల్లో వేసినట్లు అధికారులు తెలిపారు. మండల పరిధిలోని మాచనపల్లి, లింగంపల్లి, నూతనకల్, ఎర్రపహాడ్, దిర్శనపల్లి, చిల్పకుంట్ల, మిర్యాల, అల్లునూరు గ్రామాల్లో సుమారు 300 ఎకరాల్లో నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయి. పొట్ట దశలో ఉన్న వరి ఎండిపోతుండడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. చేసేదేమీ లేక పశువులు, గొర్రెలు, మేకలకు మేతగా వదిలేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పూర్తి స్థాయిలో గోదావరి జలాలు విడుదల చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

### పొట్ట దశలో ఎండిపోతున్నది



నాకు ఊరి శివారులో మూడు ఎకరాల భూమి ఉంది. 60 వేల రూపాయల పెట్టుబడి పెట్టి వరి సాగు చేసిన. పొలం పొట్ట దశలోకి వచ్చింది. బోరు సరిగా పొయ్యడం లేదు. పొలంఎండిపోతున్నది. గత ప్రభుత్వంలో ఎస్సారెస్పీ కాల్వల నీరు వచ్చి చెరువు నిండి నీళ్లకు ఇబ్బంది లేకుండె. బోర్లు, బావుల్లో పుష్కలంగా నీళ్లు ఉండేవి. వ్యవసాయం మంచిగా చేసుకున్నాం. కానీ ఇప్పుడు కాల్వల ద్వారా నీళ్లు వదలక పొలాలు ఎండి పోతున్నాయి. సర్కారు ఆదుకోవాలి. 20 రోజులు పొలానికి నీళ్లు లేక కండ్ల ముందే ఎండుతుంటే చూడ బుద్ధి కావడం లేదు.

**-బయ్య అశోక్, రైతు, నూతనకల్**

## ప్రభుత్వ చేతగాని తనంతో కరువు పరిస్థితులు

- రాష్ట్రాన్ని బీడు భూములుగా మార్చిన కాంగ్రెస్
- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య
- మునుకుంట్లలో ఎండిపోయిన పంట పొలాల పరిశీలన

కట్టంగూర్, ఫిబ్రవరి 23 : ప్రభుత్వ చేతగాని తనంతో రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. కట్టంగూర్ మండలం మునుకుంట్ల గ్రామంలో ఆదివారం ఎండిపోయిన రైతు బీమనబోయిన భిక్షం పంట పొలాలను పరిశీలించి సమస్యలను రైతును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వచ్చిన 13నెలల్లో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. కండ్ల ముందే ఎండిపోతున్న పంట పొలాలను రైతులు కాపాడుకోలేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ పాలనలో సాగునీరు లేక, కరెంట్ సకాలంలో రాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎంపిక చేసిన పైలట్ ప్రాజెక్టు గ్రామాల్లో కూడా సగం మంది రైతులకు రైతు భరోసా ఇవ్వలేదని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పాడి పంటలతో సంతోషంగా ఉన్న రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం బీడు భూములుగా మార్చిందని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంతి కేసీఆర్ రైతులను రాజు చేయాలని అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అండగా నిలువగా నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు అరిగోస పడుతున్నారని అన్నారు. కరువుతో తీవ్రంగా నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం ఎకరానికి రూ.50వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ తరాల బలరాములు, మాజీ వైస్ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, పోగుల నర్సింహ, పెద్ది బాలనర్సయ్య, నాయకులు పనస సైదులు, అంతట ఇశ్రీను, రెడ్డిపల్లి మనోహర్, వడ్డె సైదిరెడ్డి ఉన్నారు.



మునుకుంట్లలో ఎండిపోయిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

# స్వర్ణమయం.. దివ్య విమాన వైభవం

**నెరవేరిన మాజీ సీఎం కేసీఆర్ సంకల్పం**

- ఘనంగా యాదగిరీశుడి మహాకుంభాభిషేక సంప్రోక్షణ
- వేడుకకు హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 23 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్య విమానగోపురం స్వర్ణ కాంతుల్లో ఆవిష్కృమైంది. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సంకల్పం నెరవేరింది. గత ప్రభుత్వ హయాంలో సీఎం, మంత్రులు, ఇతర ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల నుంచి సేకరించిన బంగారం విరాళంతో పాటు దేవస్థాన ఖజానాతో కొనుగోలు చేసిన 68 కేజీల బంగారంతో దివ్య విమానగోపురాన్ని స్వర్ణమయం చేశారు. దివ్య విమానగోపుర మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవానికి ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు హాజరై ఆవిష్కరించారు. ఉదయం 11.22 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యతో కలిసి యాదగిరిగుట్టకు చేరుకున్నారు. కొండపైన ఉత్తర మాఢవీధుల్లో జరిగిన పంచకుండాత్మకమహా పూర్ణాహుతిలో పాల్గొన్నారు. ఉత్తర పంచతల రాజగోపురం నుంచి ఆలయంలోకి ప్రవేశించారు. అక్కడి నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పరంజా సహాయంతో దివ్య స్వర్ణ విమానగోపురం వద్దకు చేరుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, వానమామలై మఠం 31వ పీఠాధిపతులు రామానుజ జీయర్ స్వామి సూచనలతో మహాకుంభాభిషేక ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా ఆలయ ముఖ మండపంలో ప్రధానార్చకులు సీఎం దంపతులకు చతుర్వేద ఆశీర్వచనం చేయగా దేవదాయ ధర్మదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ స్వామివారి ప్రసాదం, చిత్రపటం బహూకరించారు. సాయంత్రం దివ్య విమానగోపుర మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాలను అర్చకులు పరిపూర్ణం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామేలు, వేముల వీరేశం, నేనావత్ బాలూనాయక్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, శ్రీనివాసరాజు, చీఫ్ సెక్రటరీ శాంతికుమారి, కలెక్టర్ హనుమంతరావు, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు, కమిటీ సభ్యులు మోహన్‌రావు, ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ఆలయ ప్రధానార్చకుడు కాండూరి వేంకటాచార్యులు, శోభారాణి, గోవిందహరి తదితరులు పాల్గొన్నారు.

**చెప్పులతో ఆలయంలోకి కాంగ్రెస్ నాయకులు**

దివ్య విమానగోపుర మహాకుంభాభిషేక సంప్రోక్షణలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు నానా హంగామా చేశారు. విమాన గోపురంపైకి వెళ్లేందుకు పరిమిత సంఖ్యలో అనుమతినిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు పైకి వెళ్లేందుకు సెక్యూరిటీ సిబ్బందితో వాగ్వాదం చేశారు. పలువురు నాయకులు తిరుమాఢ వీధుల్లో చెప్పులతోనే సంచరించారు. చెప్పులు వేసుకునే ఆలయంలోకి ప్రవేశించారు.

### కేసీఆర్ పిలుపుతో భారీగా బంగారం విరాళాలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రాన్ని మాజీ సీఎం కేసీఆర్ రూ. 1300 కోట్ల ప్రభుత్వ ఖజానాతో ఎంతో అద్భుతంగా పునర్నిర్మించారు. సుమారు 21 సార్లు యాదగిరిగుట్టకు వచ్చి స్వామివారి ఆలయాన్ని ప్రత్యక్షంగా పర్యవేక్షించి లోటుపాట్లు లేకుండా నిర్మించాలని స్థపతులు, వైటీడీఏ అధికారులకు సూచించారు. ఈ క్రమంలో స్వామివారి దివ్య విమాన గోపురాన్ని స్వర్ణమయం చేయాలని సంకల్పించారు. ఈ గొప్ప కార్యాన్ని ప్రజలను భాగస్వామ్యం చేయాలని 2020 అక్టోబర్ 19న పిలుపునిచ్చారు. 2021, సెప్టెంబర్ 25 నుంచి ఆలయ అధికారులు బంగారం విరాళాలు సేకరించే పనిలో పడ్డారు. దాంతో పెద్ద ఎత్తున బంగారం విరాళాల రూపంలో, హుండీల ద్వారా వచ్చిన వాటితో స్వర్ణతాడపం పనులు పూర్తి చేశారు.

### వైటీడీఏ డిప్యూటీ స్థపతికి అవమానం

దివ్య విమానగోపుర మహాకుంభాభిషేక మహోత్సవంలో ఒక స్థపతిని ఈఓ భాస్కర్‌రావు అవమాన పరిచారు. 'మిమ్ముల్ని పిలువ లేదు.. నీవు రావొద్దు' అంటూ వైటీడీఏ డిప్యూటీ స్థపతి మోతిలాల్‌ను ఈఓ అడ్డుకున్నాడు. దీంతో ఆ డిప్యూటీ స్థపతి అవమానంతో వెనుదిరిగాల్సి వచ్చింది. ఇది చూసిన అక్కడి పోలీసు సిబ్బంది, పత్రికా విలేకరులు, దేవాలయ సిబ్బంది ఆశ్చర్యపోయారు. సుమారు ఆరేండ్లపాటు శ్రమించి దేవాలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దిన స్థపతికి అవమానం జరుగడంపై పలువురి నుంచి విమర్శలు వచ్చాయి.



మాఢ వీధుల్లో చెప్పులు వేసుకుని తిరుగుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

## మహా శివరాత్రి వేడుకలకు రండి

**మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి ఆలయ కమిటీల ఆహ్వానం**



మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న నాగారం శివాలయ ఉత్సవ కమిటీ సభ్యులు

సూర్యాపేట రూరల్/నాగారం, ఫిబ్రవరి 23 : సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని పిల్లలమర్రిలో జరిగే మహా శివరాత్రి ఉత్సవాలకు రావాలని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డికి ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ గవ్వ వెంకటకృష్ణారెడ్డి ఆహ్వానం అందించారు. ఆయన వెంట రాపర్తి మహేశ్‌కుమార్, జెర్రిపోతుల భిక్షం, దాసరి భిక్షం ఉన్నారు. అలాగే నాగారం మండల కేంద్రంలోని శివాలయంలో జరుగనున్న మహాశివరాత్రి వేడుకలకు రావాలని జగదీశ్‌రెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానం అందించారు. శివాలయ కమిటీ అధ్యక్షుడు బొబ్బిలి లింగమల్లు, ఉపాధ్యక్షుడు కన్నబోయిన చిన్న అంజయ్య, ప్రధాన కార్యదర్శి చిప్పలపల్లి మల్లేశ్, చిప్పలపల్లి చిరంజీవి, కత్తుల వెంకన్న, బద్దం వంశీ, కన్నెబోయిన మహేశ్., కృష్ణ, కుంభం వెంకటేశ్, వేల్పుల మహేశ్, మధు ఉన్నారు.

## బోనస్ డబ్బులు పడినయ్.. రుణమాఫీ కాలె

- రైతు తోట యాదగిరి
- రుణమాఫీ కోసం సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తానని వెల్లడి



శాలిగౌరారంలో మాట్లాడుతున్న రైతు తోట యాదగిరి

శాలిగౌరారం, ఫిబ్రవరి 23 : హైదరాబాద్‌లో గాంధీ భవన్ ముందు 'నాకు రుణ మాఫీ కాలేదు, సన్న ధాన్యానికి బోనస్ డబ్బులు పడలేదు' అని శాలిగౌరారం మండలంలోని అంబారిపేట గ్రామానికి చెందిన రైతు తోట యాదగిరి ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఆందోళన చేసిన రాత్రే తన ఖాతాలో సన్న ధాన్యానికి బోనస్ డబ్బులు పడ్డాయని, కానీ రుణమాఫీ కాలేదని రైతు యాదగిరి తెలిపాడు. శాలిగౌరారం మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణ మాఫీ కోసం మరోమారు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు ప్రయత్నం చేస్తానని చెప్పారు. ఇది ఇలా ఉంటే గాంధీ భవన్‌కు వస్తే తప్ప రైతులకు సన్న వడ్లకు బోనస్ డబ్బులు ఇవ్వరా అని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. సమావేశంలో అన్నెబోయిన సుధాకర్, గర్దాసు లింగయ్య, నోముల జనార్దన్, భూపతి అంజయ్యగౌడ్, భూపతి వెంకన్నగౌడ్, నిమ్మల కృష్ణయ్య ఉన్నారు.

## బీసీలు కాంగ్రెస్ పార్టీని బొందపెట్టడం ఖాయం

- మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్



యాదగిరిగుట్ట, ఫిబ్రవరి23 : బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని, కుట్రపూరితంగా కులగణన అంటూ సీఎం రేవంత్‌రెడ్డి మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బూడిద భిక్షమయ్యగౌడ్ అన్నారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీ కుల గణనలో ఎక్కడ తప్పు జరిగిందో చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యాలను ఆయన తీవ్రంగా ఖండించారు. సర్వే చేయిస్తాం.. 42 శాతం బీసీలకు రిజర్వేషన్ ఇస్తామని మాట ఇచ్చింది నువ్వే కదా అని పశ్నించారు. కులగణన చేసింది సైతం నువ్వేనని తప్పు ఎక్కడ జరిగిందో తెలుసుకోలేని అసమర్థ పాలన సాగిస్తున్న రేవంత్‌రెడ్డిని బీసీలు క్షమించరని పేర్కొన్నారు. సర్వేలో సూచించిన 56 ప్రశ్నలే నువ్వు చేసిన మొదటి తప్పని అన్నారు. కులగణనకు అడ్డంకిగా 56 ప్రశ్నలు మారుతాయని సీఎం రేవంత్‌రెడ్డి ముందే తెలుసునని, తప్పు ఎలా జరిగిందో రేవంత్ తన సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లిలో ప్రజలకు అడిగితే తెలుస్తుందని తెలిపారు. రాష్ట్రంలో ఒక్క గ్రామంలో సైతం నిజాయితీగా కులగణన సర్వే జరుగలేదని, చిత్తశుద్ధి ఉంటే కులగణన సర్వేపై అఖిలపక్షం నాయకులతో ప్రత్యేక కమిటీని వేసి సర్వే చేయాలని సూచించారు. రేవంత్ మాట ప్రకారం బీఆర్ఎస్ పార్టీ ప్రశ్నిస్తుందని, వెంటనే సమగ్ర కులగణన సర్వే చేయించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని, ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేకపోతే బీసీలంతా ఏకమై కాంగ్రెస్ పార్టీ బొందపెట్టడం ఖాయమని తెలిపారు.

# ఇంటర్ పరీక్షలకు సన్నద్ధం

- మార్చి 5 నుంచి 20 వరకు వార్షిక పరీక్షలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 113 పరీక్ష కేంద్రాలు
- హాజరు కానున్న 52,222 మంది విద్యార్థులు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ



రామగిరి, ఫిబ్రవరి 23 : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు విద్యాశాఖ ఏర్పాట్లలో నిమగ్నమైంది. గత నెలలో ప్రారంభమైన ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 22తో ముగిశాయి. దీంతో మార్చి 5 నుంచి 20వరకు జరిగే వార్షిక పరీక్షలపై దృష్టి సారించింది. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం ఇప్పటికే చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఇన్విజిలేటర్స్‌ను నియమించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 113 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయనుండగా 2,222 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగనుండగా గంట ముందునుంచే పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించనున్నారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించేలా విద్యార్థులను అధ్యాపకులు ప్రిపేర్ చేస్తున్నారు.

**వేసవి దృష్ట్యా మౌలిక వసతులు**

ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా జరిగేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఉన్నతాధికారులు జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులతోపాటు ఇన్విజిలేటర్లు, ఇతర అధికారులు సైతం సెల్‌ఫోన్లు తీసుకెళ్లొద్దని ఆదేశాలు జారీ చేశారు. ఎండకాలం దృష్ట్యా తాగునీరు అందుబాటులో ఉంచనున్నారు. ఎవరైనా అస్వస్థతకు గురైతే వెంటనే ప్రథమ చికిత్స అందించేలా ప్రతి పరీక్ష కేంద్రం వద్ద వైద్య సిబ్బందిని నియమించనున్నారు. పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు విద్యార్థులకు అందుబాటులో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

### అన్ని ఏర్పాట్లు చేశాం



ఇంటర్మీడియేట్ విద్యా శాఖ, కలెక్టర్ ఆదేశాల మేరకు ఇంటర్ పరీక్షల నిర్వహణకు అంతా సిద్ధం చేశాం. సీఎస్, డిపార్టుమెంట్ అధికారులతో ఈ నెల 28న సమావేశం నిర్వహించి సూచనలు చేయనున్నాం. పరీక్షలో ఇబ్బందులు లేకుండా ఫ్లయింగ్ స్వాడ్స్‌తోపాటు జిల్లా పరీక్ష విభాగం అధికారులు పర్యవేక్షణ చేస్తారు. విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడితే ఆ పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌తోపాటు సంబంధిత బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. ఎండల దృష్ట్యా అన్ని పరీక్ష కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉంచుతున్నాం.

**- దస్రూ, డీఐఈఓ, నల్లగొండ**

| జిల్లా | పరీక్ష కేంద్రాలు | ప్రథమ సంవత్సరం | ద్వితీయ సంవత్సరం | మొత్తం |
|---|---|---|---|---|
| నల్లగొండ | 52 | 13,992 | 14,730 | 28,722 |
| సూర్యాపేట | 32 | 8,640 | 8,308 | 16,948 |
| యాదాద్రి | 29 | 6,252 | 6,300 | 6,852 |
| మొత్తం | 113 | 28,884 | 29,338 | 52,222 |